నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# రంగారెడ్డి

గురువారం 28 డిసెంబర్ 2023
THURSDAY, DECEMBER 28, 2023 | RANGAREDDY | పేజీలు : 8 PAGES




# భద్రత..భరోసా..

## పాఠశాల స్థాయిలోనే బాలికల్లో ఆత్మస్థైర్యం నింపేలా విద్యాశాఖ చర్యలు

ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బాలికల సాధికారత క్లబ్‌ల ఏర్పాటు

సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనేలా క్లబ్‌ల తోడ్పాటు

రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే వంద ప్రభుత్వ పాఠశాలల్లో క్లబ్‌ల ఏర్పాటు

**బాలికలకు భరోసా కల్పించేలా** కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన విధానాలనే ఈసారి కూడా విద్యాశాఖ కొనసాగిస్తున్నది. ఎప్పటి లాగే ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల సాధికారత క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నది. ఇటీవలే రంగారెడ్డి జిల్లాలోని వంద పాఠశాలల్లో ఏర్పాటు చేసింది. విజ్ఞానం, నైపుణ్యం, ఆత్మవిశ్వాసం తదితర వాటిని పెంపొందింపజేసి పాఠశాల స్థాయిలోనే బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా ఈ క్లబ్‌లు పనిచేసేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించింది. బాలికలకు శారీరక, లైంగిక వేధింపులు జరుగకుండా చూడడం.. లైంగిక దాడుల నుంచి రక్షణ కల్పించడం, బాల్య వివాహాలు జరుగకుండా చూడడం తదితర అంశాలపై సాధికారత క్లబ్‌లు అవగాహన కల్పించనున్నాయి. అలాగే కౌమార బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత, లింగ సమానత్వం, జీవన నైపుణ్యాల పెంపు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, బాలికలపై హింసను అరికట్టేలా క్లబ్‌ల సభ్యులు చర్యలు చేపడతారు. దీంతో ఎన్నో సామాజిక సమస్యల నుంచి బాలికలకు భద్రత, భరోసా కల్పించినట్లవుతుంది.

–రంగారెడ్డి, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ)

8



అబ్దుల్లాపూర్‌మెట్‌లో 'ప్రజా పాలన'ను ప్రారంభించనున్న భట్టి

పాల్గొననున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

## నేడు ఉప ముఖ్యమంత్రి రాక



రంగారెడ్డి, డిసెంబరు 27(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్‌మెట్‌కు గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రానున్నారు. ఇక్కడి నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఉప ముఖ్యమంత్రితోపాటు రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటున్నారు. ఉదయం 8 గంటలకు జరిగే ప్రజాపాలన కార్యక్రమంలో వారు పాల్గొంటారు.

# ఇస్తరా.. ఇవ్వరా..

'దళితబంధు' కొనసాగింపుపై నీలినీడలు

ఎలాంటి స్పష్టత ఇవ్వని కాంగ్రెస్ సర్కార్

దళిత కుటుంబాల్లో సందిగ్ధం.. కొనసాగించాలని వెల్లువెత్తుతున్న వినతులు

రెండో విడుత కోసం బీఆర్ఎస్ సర్కార్ విడుదల చేసిన రూ.60 కోట్లు వెనక్కేనా?

దళితబంధు నిధులు మళ్లింపు చేసినట్లు జోరుగా ప్రచారం

**దళిత కుటుంబాల్లో** వెలుగులు నింపిన దళితబంధు పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. ఈ పథకం కొనసాగింపుపై కాంగ్రెస్ సర్కార్ ఎలాంటి ప్రకటనలూ చేయకపోవడంతో దళిత కుటుంబాల్లో సందిగ్ధత నెలకొన్నది. ఇటీవల స్పీకర్ ప్రసాద్‌కుమార్, జిల్లా ఎమ్మెల్యేలు నిర్వహించిన అధికారుల సమావేశానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీని హాజరుకావాలని ఆదేశించకపోవడంతో దళితబంధు నిలిపివేస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో దళిత కుటుంబాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఏదేమైనా దళితబంధు పథకాన్ని కొనసాగించాల్సిందేనంటూ కలెక్టర్, సంబంధిత అధికారులకు వినతులు వెల్లువెత్తుతున్నాయి. కేసీఆర్ సర్కార్ మొదటి విడుత లబ్ధిదారులకు అందించిన ఆర్థికసాయంతో తమకు నచ్చిన వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా రాణిస్తున్నారు. ఇక రెండో విడుత కోసం వికారాబాద్ జిల్లాకు రూ.60 కోట్లను కేటాయించిన కేసీఆర్ ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికనూ చేపట్టింది. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో రెండో విడుత ప్రక్రియ అర్థాంతరంగా నిలిచిపోయింది. దళితబంధును కొనసాగించేందుకు కాంగ్రెస్ సర్కార్ సుముఖంగా లేకపోవడంతో రెండో విడుతలో భాగంగా విడుదలైన రూ.60 కోట్ల నిధుల మళ్లింపు జరిగిందనే ప్రచారం జోరుగా సాగుతున్నది. ఇప్పటికే రూ.40 కోట్లను వెనక్కి తీసుకున్నట్లు సమాచారం. దళితబంధు పథకంపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలనే డిమాండ్ వెల్లువెత్తుతున్నది.

-వికారాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ)

7



దళితబంధును కొనసాగించాలని వికారాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దళితులు(ఫైల్)